సాక్షి రంగారెడ్డి

శనివారం । 20 । మే । 2023



ఆకస్మిక తనిఖీలు

వివిధ ఫెర్టిలైజర్స్, పురుగుల మందు దుకాణాలు, సీడ్ ప్రాసెసింగ్ సంస్థలపై వ్యవసాయ, పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 8లో►



ఎస్‌బీపల్లి-కొత్తపేట రోడ్డు వివరాలు తెలుసుకుంటున్న కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండే

న్యూస్‌రీల్

పల్లె సమగ్ర కేంద్రాల పనితీరు భేష్

ప్రపంచ బ్యాంకు టీం సభ్యులు



ఆగాపల్లిలో డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంకు టీం సభ్యులు

మంచాల: ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన పల్లె సమగ్ర కేంద్రాల పనితీరు బాగుందని ప్రపంచ బ్యాంకు టీంసభ్యులు అన్నారు. మండల పరిధిలోని ఆగాపల్లిలో శుక్రవారం పల్లె సమగ్ర కేంద్రాన్ని వారు సందర్శించారు. స్థానిక డ్వాక్రా సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పల్లె సమగ్ర కేంద్రం ద్వారా ఎలాంటి సేవలు అందుతున్నాయి.. ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడుతుంది అని ఆరా తీశారు. స్థానికంగా ఉన్న పల్లె సమగ్ర కేంద్రంలో బ్యాంకు మాదిరిగానే డబ్బులు చెల్లించడం, తీసుకోవడం ఉంటుందన్నారు. ప్రధానంగా మహిళలకు ఎంతో ప్రయోజనకరం అన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా డ్వాక్రా సంఘాలు ముందుకు సాగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రపంచ బ్యాంకు టీం సభ్యులు అమిత్‌అరోరా, జయేశ్‌తండలే, వర ప్రసాద్, మహిమగుప్తా, ఎంపీడీఓ శ్రీనివాస్, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ ఉదయకుమారి, ఏపీఎం శోభ, పంచాయతీ కార్యదర్శి అనిల్, స్త్రీనిధి మేనేజర్ సత్యం, సీసీలు సుజాత, జైపాల్‌రెడ్డి, లాల్‌సింగ్, వీఓఏలు సంతోష, పద్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

తుర్కయంజాల్: సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలోని పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుందరయ్య ఉన్నత కుటుంబంలో జన్మించినప్పటికీ ప్రజా శ్రేయస్సు కోసం, సమసమాజ స్థాపన కోసం, అసమానతలు అంటరానితనానికి వ్యతిరేకంగా, కుల వివక్షత వ్యతిరేక పోరాటాలను తన ఇంటి నుంచే ప్రారంభించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య, మున్సిపాలిటీ కన్వీనర్ డి.కిషన్, నాయకులు ఎం.సత్యనారాయణ, పెంటయ్య, ప్రకాష్ కారత్, కొండిగారి శంకర్, ఐ.కృష్ణ, కె.శారద, బి.శంకరయ్య పాల్గొన్నారు.

మాసబ్‌చెరువును కాపాడండి



ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో నాయకులు

తుర్కయంజాల్: కబ్జాదారుల చెర నుంచి మాసబ్ చెరువును కాపాడి, రీ సర్వే కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ శుక్రవారం మాసబ్ చెరువు పరిరక్షణ సమితి, అఖిలపక్ష నాయకుల బృందం భువనగిరి లోక్‌సభ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీ తెలంగాణ చీఫ్ సెక్రటరీ, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీలకు లేఖలు రాసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేష్, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ, కోశిక ఐలయ్య, కళ్యాణ్ నాయక్, కొండ్రు మల్లేశ్, నాయకులు పుల్లగుర్రం విజయానంద రెడ్డి, కొత్తకుర్మ శివ కుమార్, రావుల వీరేశం, కొంతం యాదిరెడ్డి, మల్లేల ఉపేందర్, అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్

సాక్షి,సిటీబ్యూరో: కొరియన్ సినిమా, పాటలకు క్రేజ్ పెరుగుతున్న నేపథ్యంలో కొరియా కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో కొరియన్ సినిమా పండుగ నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో ఈ చిత్రోత్సవం ఉంటుందని 2 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా అరడజను సినిమాలు ప్రదర్శిస్తామని నిర్వాహకులు తెలిపారు.



కొనుగోళ్లలో కొర్రీ

మిల్లర్ల సిండికేట్

- తరుగుకు ఒప్పుకొంటే ‘ఏ’ లేదంటే ‘బీ’ గ్రేడ్ ధర
- అంగీకరిస్తే క్వింటాల్‌కు రూ.2,040, లేకుంటే రూ.1,800
- ఇప్పటికీ కల్లాల్లోనే మెజార్టీ ధాన్యం
- పట్టించుకోని సివిల్ సప్లయ్ అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అకాల వర్షాలకు ఇప్పటికే భారీగా నష్టపోయిన రైతులను మిల్లర్లు మరింత దెబ్బతీస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టి పంపిన ధాన్యాన్ని దింపకుండా సతాయిస్తున్నారు. తేమతో సంబంధం లేకుండా క్వింటాల్‌కు పది కిలోల తరుగుకు ఒప్పుకొంటే ‘ఏ’ గ్రేడ్‌గా, లేదంటే ‘బీ’ గ్రేడ్‌గా పరిగణిస్తున్నారు. దీనికి అంగీకరించిన రైతులకు క్వింటాల్‌కు రూ.2,040 చొప్పున చెల్లించేందుకు అంగీకరించి, నిరాకరించిన వాళ్లకు రూ.1,800 చొప్పున చెల్లిస్తున్నారు. ఇచ్చిన ఆప్షన్లకు తలొగ్గి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. సివిల్ సప్లయ్ అధికారులు ఎప్పటికప్పుడు ఐకేపీ కేంద్రాల్లో పర్యటించి, తేమ నిర్ధారణ, తూకంలో మోసాల వంటి అంశాలను పరిశీలించాల్సి ఉన్నా..ఆఫీసు గేటు దాటి బయటికి రావడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో అమాయక రైతులు మోసపోవాల్సి వస్తోంది.

30 శాతమే సేకరణ

జిల్లాలో ఏప్రిల్ 28 నుంచి ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు షురూ అయ్యాయి. 37 కేంద్రాలకు ఇప్పటి వరకు 29 కేంద్రాలే తెరుచుకున్నాయి. 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు 1,560.400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. మెజార్టీ ధాన్యం ఇప్పటికీ కల్లాల్లోనే ఉండిపోయింది. అంతేకాదు ధాన్యం సేకరణ కోసం 15 లక్షల గన్నీ బ్యాగులు అవసరమవుతాయని అంచనా వేసి ఈ మేరకు 13 లక్షల బ్యాగులను సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 28,723 బ్యాగులను మాత్రమే ఐకేపీ సెంటర్లకు తరలించారు. ఐకేపీ కేంద్రాలు సేకరించి లారీల్లోకి ఎత్తిన ధాన్యం కూడా రైస్ మిల్లుల ముందే బారులు తీరి ఉంది. తరుగు విషయంలో మిల్లర్లు పేచీ పెడుతుండటమే ఇందుకు కారణం.

మిల్లర్లు చెప్పిందే ధర

కేశంపేట, శంకర్‌పల్లిలో కొనుగోలు కేంద్రాలు ఇప్పటికీ తెరుచుకోలేదు. ఆయా ప్రాంత రైతులు తమ ధాన్యాన్ని నేరుగా మిల్లుకు తరలిస్తున్నారు. రైతుల్లో ఉన్న బలహీనతను మిల్లర్లు ఆసరాగా తీసుకుని క్వింటాల్‌కు రూ.1,700–1,800 చెల్లిస్తున్నారు. ఇక ఆమనగల్లు మార్కెట్ యార్డుకు రోజుకు మూడు వేలకుపైగా బస్తాల ధాన్యం వస్తోంది. ఇందులో 1,500 నుంచి 2,000 బస్తాలు మాత్రమే తూకం వేస్తున్నారు. మార్కెట్లో నిల్వలు రోజురోజుకూ పెరుగుతుండటంతో రైతులకు రోజుల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. అకాల వర్షం కురిస్తే ధాన్యం రాసులపై కప్పేందుకు అవసరమైన టార్పాలిన్లు కూడా లేవు. అంతేకాదు మార్కెట్లో క్వింటాలుకు ఐదు కేజీల వరకు తరుగు తీస్తున్నారు. మార్కెట్‌కు తాను ఇటీవల 90 బస్తాల ధాన్యం తీసుకురాగా, క్వింటాలుకు ఐదు కిలోల వరకు తరుగు తీశారని మేడిగడ్డతండాకు చెందిన ఇస్లావత్ జానకిరాం చెప్పారు.

ఆందోళనకు దిగుతున్న రైతులు

యాచారం మండలం మంతన్‌గౌరెల్లి కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 750 బస్తాలు సేకరించి మిల్లర్లకు పంపగా, దాంట్లో తేమ, తాలు శాతం ఎక్కువగా ఉందని మిల్లర్లు కొర్రీలు పెట్టడంతో ఆ ధాన్యమంతా అక్కడే నిల్వ ఉంది. యాచారం, చింతపట్ల కేంద్రాల నుంచి తరలించిన ధాన్యాన్ని కూడా తీసుకునేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారు. దీంతో నిర్వాహకులు 40 కిలోల బస్తాకు..నాలుగు కేజీల తరుగు తీస్తున్నారు. ఇందుకు రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో నాలుగు రోజులుగా కొనుగోళ్లు నిలిపివేశారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు కొనుగోలు కేంద్రాల్లో పర్యటించి, సమస్యను పరిష్కరించాల్సి ఉన్నా ఇప్పటి వరకు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టరేట్‌లోని కార్యాలయంలోనూ ఉండటం లేదు. క్షేత్రస్థాయి పర్యటనల పేరుతో తరచూ విధులకు గైర్హాజరవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జంట జలాశయాల చేరువలో లేక్‌సిటీ

- జీవో 111 ఎత్తివేత నేపథ్యంలో త్వరలో మరో కొత్త జీఓ
- ఇందులోని విధివిధానాల మేరకు హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్
- సగానికి పైగా తగ్గనున్న జంట జలాశయాల బఫర్‌జోన్

సాక్షి, సిటీబ్యూరో: జీవో 111ను పూర్తిగా ఎత్తివేసిన నేపథ్యంలో హైదరాబాద్ మహానగరాన్ని ఆనుకొని మరో అద్భుతమైన లేక్‌సిటీ నిర్మాణానికి కార్యాచరణ ఆరంభమైంది. ఆకాశాన్నంటే హైరైజ్‌డ్ బహుళ అంతస్తుల భవనాలతో జంట జలాశయాలకు చేరువలో ఈ లేక్‌సిటీ రూపుదిద్దుకోనుంది. హెచ్‌ఎండీఏ నిబంధనలకు అనుగుణంగానే జీవో 111 పరిధిలోని గ్రామాల్లో భవన నిర్మాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఐటీ పరిశ్రమలు తదితర నిర్మాణాలకు అనుమతులనివ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించిన దృష్ట్యా ఆ దిశగా హెచ్‌ఎండీఏ కసరత్తు చేపట్టింది. ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ ప్రకారమే హెచ్‌ఎండీఏ పరిధిలో నిర్మాణ అనుమతులను అందజేస్తున్నారు. ఇదే పద్ధతిలో 111 జీవో పరిధిలోని 84 గ్రామాల్లో కూడా నిర్మాణాలను చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిరక్షణ కోసం తెచ్చిన జీవో 111 పూర్తిగా ఎత్తివేసిన దృష్ట్యా ప్రభుత్వం మరో కొత్త జీఓను తేవాల్సి ఉంది. ‘కొత్త జీఓలోని విధివిధానాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ ఉంటుందని హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇందుకోసం కొంత సమయం పట్టవచ్చునన్నారు. మరోవైపు గత సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీన జీవో 111 ఎత్తివేస్తూ దానిస్థానంలో జీఓ 69 విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణం కోసం ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇటీవల సమర్పించిన నివేదికను అనుగుణంగానే కొత్త మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేయనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారి పేర్కొన్నారు.

సగానికి పైగా తగ్గనున్న బఫర్‌జోన్...

ప్రస్తుతం జంట జలాశయాలకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏడు మండలాల పరిధిలోని 84 గ్రామాలలో జలాశయాల పరిరక్షణ దృష్ట్యా నిర్మాణాలను నిషేధించిన సంగతి తెలిసిందే. 111 జీఓ ఎత్తివేత దృష్ట్యా రెండు జలాశయాల బఫర్ జోన్ పరిధిని భారీగా కుదించే అవకాశం ఉంది. మురికి నీరు చెరువుల్లోకి చేరకుండా రింగ్‌మెయిన్ వంటి నిర్మాణాలతో పాటు, మురికి నీటి శుద్ధిప్లాంట్‌లను కూడా ఏర్పాటు చేయనున్నందున బఫర్‌జోన్‌ను 5 కిలోమీటర్ల కంటే తక్కువ పరిధికి విస్తరించే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి వరకు 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో భారీఎత్తున నివాస ప్రాంతాలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు ఇప్పటికే చేపట్టిన అక్రమ కట్టడాలన్నింటికీ అనుమతులు లభించొచ్చు. మొయినాబాద్, శంషాబాద్, షాబాద్, కొత్తూరు, శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల మండలాల పరిధిలో పరిధిలో సుమారు 1.32 లక్షల ఎకరాల భూమి వినియోగంలోకి రానుంది. ఇందులో ప్రస్తుతం బయోకన్సర్వేషన్‌జోన్‌లో ఉన్న 90 శాతం భూమిపైన ఆంక్షలు తొలగడంతో భారీ ఎత్తున నిర్మాణ అనుమతులు లభించనున్నాయి. త్వరలో రానున్న కొత్త జీఓ సూచించే విధివిధానాల ప్రకారం బయోకన్సర్వేషన్ జోన్‌ను వినియోగంలోకి తెచ్చేవిధంగా మాస్టర్ ప్లాన్ ఉంటుందని అధికారులు చెప్పారు. సుమారు లక్ష ఎకరాల ప్రైవేట్ భూమిలో 75 శాతం వరకు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ‘ప్రస్తుతం నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలు, తదితర జలవనరులు, అడవులు, పర్యావరణ పరిరక్షణకు జీవవైవిధ్య సమతుల్యతకు పాటిస్తున్న ప్రమాణాలనే 111జీవో పరిధిలోనూ అమలు చేస్తూ మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేస్తాం’ అని అధికారులు చెప్పారు.

మూడు దశాబ్దాల కల నెరవేరింది

- 111 జీవో ఎత్తివేయడం చరిత్రాత్మకం
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి
- మొయినాబాద్‌లో ఘనంగా సంబరాలు

మొయినాబాద్: 111 జీవో ఎత్తివేయాలనేది మూడు దశాబ్దాల కల.. జీవో పరిధిలోని 84 గ్రామాల ప్రజల కల నెరవేరిందని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. 111 జీవోను ఎత్తివేస్తూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడంపై శుక్రవారం మొయినాబాద్‌లో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఎమ్మెల్యే యాదయ్య మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. 111 జీవో ఎత్తేస్తామని సీఎం కేసీఆర్ మాట ఇచ్చారని.. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. జీవో పరిధిలోని ప్రాంతం మినీ హైదరాబాద్ నగరంగా నిర్మితమవుతుందన్నారు. జీవో ఎత్తివేయడం చారిత్రక నిర్ణయమన్నారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. 111 జీవో ఎత్తివేయడం హర్షణీయమన్నారు. జీవో ఎత్తివేతతో 84 గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, సర్పంచ్‌లు నరోత్తంరెడ్డి, మనోజ్‌కుమార్, శ్రీనివాస్, రాజు, మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, అర్జున్, రితీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

‘డబుల్’ సర్కార్ ఖాయం

- రాష్ట్రంలో రూ.6,500 కోట్లతో రహదారుల అభివృద్ధి
- హామీల అమలులో కేసీఆర్ విఫలం
- కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం కొత్తూరు మండలం ఎస్‌బీ పల్లి నుంచి కొత్తపేట వరకు కేంద్ర నిధులు రూ.20కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం షాద్‌నగర్‌లోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మేధావుల సమ్మేళనంలో పాల్గొన్నారు. కొత్తూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు కావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆ పార్టీ నేతల అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరిస్తామన్నారు. బీజేపీ సర్పంచులు ఉన్న గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన పల్లెల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. తెలంగాణలో జాతీయ రహదారులతో పాటు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కోసం కేంద్రం ఐదేళ్ల కాలంలో రూ.6,500 కోట్లు మంజూరు చేసిందన్నారు. శంషాబాద్ నుంచి బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ కోసం కేంద్రం రూ.900 కోట్లు కేటాయించిందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం భారీ ఎత్తున నిధులను మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, మిథున్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శక్తివంతమైన దేశంగా భారత్

ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే భారత్ శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేధావులతో నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. దేశంలో ఉగ్రవాద నిర్మూలన, పాకిస్తాన్, చైనా ఆక్రమణలను అడ్డుకునేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. దేశంలోకి చొరబాట్లను నియంత్రించేందుకు గాను దేశ సరిహద్దులో రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేయడంతో పాటు, జవాన్‌ల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు.

గ్రేటర్‌కు ‘పెద్ద’ షాక్!

- రూ.2 వేల నోట్లు విత్‌డ్రాతో ఉలిక్కిపడ్డ ‘నల్ల’ కుబేరులు
- ఎలక్షన్ ఇయర్ కావడంతో అవాక్కైన రాజకీయ నేతలు
- మార్పిడి, ప్రత్యామ్నాయాలపై మొదలైన సంప్రదింపులు
- హవాలా లావాదేవీలు సైతం పెరిగిపోయే అవకాశాలు



సాక్షి, సిటీబ్యూరో: దేశంలో ఆరున్నరేళ్ల తర్వాత మరో డీమానిటైజేషన్ చోటు చేసుకుంది. క్లీన్ నోట్ పాలసీలో భాగంగా రూ.2 వేల నోట్లను ఉపసంహరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 23 నుంచి వీటిని మార్చుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు మాత్రమే బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి అంగీకరిస్తారు. ఈ పరిణామాలు ‘గ్రేటర్’ పరిధిలోని రియల్టీ, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో ఉన్న పెద్దలతో పాటు రాజకీయ నాయకులకు పెద్ద షాక్ ఇచ్చింది.

సగానికి పైగా నల్లధనమే..

రియల్‌ఎస్టేట్ రంగంలో జరిగే లావాదేవీల్లో అత్యధికం నగదు రూపంలో, అదీ నల్లధనం చెలామణి ఎక్కువ. ఏ భూమి చూసినా దాని కార్డ్ వాల్యూకి, మార్కెట్ ధరకు మధ్య పొంతన ఉండదు. వీటి మధ్య దాదాపు 60 నుంచి 80 శాతం వరకు వ్యత్యాసం ఉంటుంది. కార్డ్ వాల్యూగా పిలిచే ప్రభుత్వ ధర రూ.లక్షల్లో ఉంటే మార్కెట్ రేటు రూ.కోట్లకు చేరుతుంది. ఈ కారణంగానే డాక్యుమెంట్లలో కార్డ్ వాల్యూ నమోదు చేసే క్రయవిక్రయదారులు ఆ మేరకు మాత్రమే డీడీలు, చెక్కులు తదితర రూపాల్లో బదిలీ చేసుకుంటాయి. మిగిలిన మొత్తం నగదు రూపంలో ఇచ్చిపుచ్చుకుంటారు. దీంతో పాటు నిర్మాణ రంగంలోనూ నగదు లావాదేవీలు ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. ఈ రెండు చోట్లా చెలామణి అయ్యే వాటిలో రూ.2 వేల నోట్లే ఎక్కువగా ఉంటాయన్నది జగమెరిగిన సత్యం.

నేతలు, బినామీల వద్దా ఇవే..

రాష్ట్ర శాసనసభకు ఈ ఏడాది చివరలో, పార్లమెంట్‌కు వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం నెలకొన్న పరిణామాల నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని చిన్న ఎమ్మెల్యే నియోజకవర్గానికీ రూ. కోట్లలో ఖర్చు పెట్టాల్సిందే. ఎన్నికల సంఘానికి చిక్కకుండా చేసే ఈ ఖర్చుల్లో నల్లధనమే ఎక్కువగా ఉంటుంది. దీని కోసం బడా, ఛోటా నేతలు, వాళ్ల బినామీలు భారీ మొత్తం రూ.2 వేల నోట్ల రూపంలో దాచిపెట్టారన్నది బహిరంగ రహస్యం. ఈ కారణంగానే రూ.3 లక్షల కోట్లకుపైగా విలువైన రూ.2 వేల నోట్లు చెలామణిలో ఉన్నాయని ఆర్బీఐ చెబుతున్నా..బ్యాంకుల్లో మాత్రం ఇవి అందుబాటులో లేవు. బ్యాంకుల్లో లేవనే విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ సైతం అంగీకరిస్తోంది. అలా దాచి పెట్టుకున్న నేతలకు ప్రస్తుతం ఆర్బీఐ తీసుకున్న నిర్ణయం శరాఘాతంగా మారింది.

నిఘా పెంచాలని పోలీసుల నిర్ణయం..

ఈ పరిణామాల నేపథ్యంలో నోట్ల మార్పిడికి భారీగా డిమాండ్ రానుంది. దీన్ని అదునుగా చేసుకుని హవాలా ర్యాకెట్లు లావాదేవీలు ఒక్కసారిగా పెరిగిపోతాయి. వీటన్నింటికీ మించి కమీషన్ తీసుకుని నోట్లు మార్పిడి చేసి ఇచ్చే వ్యవస్థీకృత ముఠాలు, ఆ పేరు చెప్పి మోసాలకు పాల్పడే కేటుగాళ్లు రెచ్చిపోతారు. 2016 నవంబర్ 10న అమలులోకి వచ్చిన డీమానిటైజేషన్ సందర్భంలో ఇలాంటి అనేక ఉదంతాలు చోటు చేసుకున్నాయి. వీటిని పరిగణలోకి తీసుకుంటున్న పోలీసు, నిఘా విభాగాలు సైతం అప్రమత్తమం అవుతున్నాయి. ఇప్పటికే ఉన్న హవాలా రాకెట్లు, గతంలో ఈ కేసుల్లో అరెస్టు అయి బయటకు వచ్చిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. వీటికి తోడు త్వరలో ఎదురుకానున్న నోట్ల మార్పిడి కష్టాలు తలుచుకుంటూ జనం సైతం ఉలిక్కిపడుతున్నారు. 2016 నాటి అనుభవాలను నెమరువేసుకుంటున్నారు.

పరిశ్రమలతోనే స్వయం సమృద్ధి

- కలెక్టరేట్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ఎక్స్‌పో
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఎక్స్‌పోను ప్రారంభించి ఉత్పత్తులను పరిశీలిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

సాక్షి,రంగారెడ్డిజిల్లా: పరిశ్రమల ఏర్పాటుతోనే స్వయం సమృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్ పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కొంగరలోని జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ఎక్స్‌పో’ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లతో చిన్నతనంలోనే మధుమేహం, అధిక రక్తపోటు వంటి వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. సూక్ష్మ ఆహార తయారీ పరిశ్రమల ఏర్పాటుతో స్వయం ఉపాధి పొందడంతో పాటు, ఆయిల్, పప్పులు, ఇతర ఆహార పదార్థాలను ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చని చెప్పారు. తద్వారా ఆహార కల్తీని నియంత్రించడమే కాకుండా దీర్ఘకాలిక వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చని సూచించారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి, తయారీదారుల క్రమబద్ధీకరణ పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహకాలు సబ్సిడీపై రుణాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం మహిళా సమాఖ్య గ్రూపులకు రూ.పది లక్షల వరకు రుణం అందజేస్తోందన్నారు.

మహిళా సమాఖ్యలకు అవకాశం

అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. రైతులు ఆగ్రోబేస్ వస్తువులు తయారు చేసి ఆర్థికంగా ఎదగొచ్చన్నారు. కలెక్టరేట్‌లో మహిళా సమాఖ్య గ్రూపులకు కూరగాయాలు అమ్ముకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. పోచంపల్లి చేనేత వస్త్రాలతో పాటు చిరు ధాన్యాలు అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. బ్యాంకుల నుంచి సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆహార పరిశ్రమలను ప్రోత్సహించాలనే ఆలోచనతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద తోడ్పాటును అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా పరిశ్రమల మేనేజర్ వినయ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా పరిశ్రమల మేనేజర్ పవన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్, పీడీ మెప్మా అహ్మద్ సఫీవుల్లా, జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి సునందరాణి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి: చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశుయాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆంజనేయులు (50), జయమ్మ దంపతులు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. కూతురు వివాహమైంది. పెద్ద కుమారుడు వెంకటేశుతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ తండ్రి ఆంజనేయులు జంగారెడ్డిపల్లిలో నివాసముంటున్నాడు. చిన్న కుమారుడు మహేందర్‌తో కలిసి తల్లి జయమ్మ హైదరాబాద్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆంజనేయులు ఇటీవల మద్యానికి బానిసై ఏ పని చేయకుండా గ్రామంలో తిరుగుతుండేవాడు. ఈ నెల 18న రాత్రి పొలం వద్దకు వెళ్తున్నానని కొడుకుకు చెప్పి వెళ్లాడు. మరునాడు ఉదయం గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఉండటంతో గ్రామస్తులు చూశారు. విషయం కుటుంబసభ్యులకు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

షాద్‌నగర్: వ్యవసాయ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వివిధ ఎరువులు, పురుగుల మందుల దుకాణాలు, సీడ్ ప్రాసెసింగ్ సంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ నవీన్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు పట్టణంలోని వివిధ ఫెర్టిలైజర్స్ దుకాణాలతో పాటు, సోలీపూర్ పరిధిలోని విత్తన తయారీ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. అలాగే ఎరువులు, విత్తనాలకు సంబంధించిన నాణ్యతను పరిశీలించారు. అనంతరం సీఐ నవీన్‌కుమార్, ఏఓ నిషాంత్‌కుమార్‌లు మాట్లాడుతూ... నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి విత్తనాలు అమ్మిన వారిపై పీడీ యాక్టులు నమోదు చేస్తామని అన్నారు. రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రశీదులను విధిగా తీసుకోవాలని సూచించారు. ఈ రశీదులను పంట కాలం పూర్తి అయ్యే వరకు రైతులు భద్రంగా దాచిపెట్టుకోవాలని అన్నారు. పంట నష్టపరిహారం కావాలంటే ఈ రశీదులు తప్పని సరి అని అన్నారు. అదేవిధంగా ఫెర్టిలైజర్ దుకాణాల వారు విధిగా స్టాక్స్ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు.



షాద్‌నగర్ పట్టణంలోని విత్తనాలు, ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం

అబ్దుల్లాపూర్‌మెట్: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ హెచ్చరించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని, చిన్న రావిరాల, గువలేటి గ్రామాలలో ఉన్న ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాల్లో ఎస్‌ఐ మన్మథకుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఉన్న ఎరువులు, విత్తనాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సీఐ మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్: చిన్నరావిరాలలో తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్‌ఐ

యువజన కాంగ్రెస్ కమిటీలో ముగ్గురికి చోటు



ఉదయ్‌గౌడ్



సాబేర్



ప్రశాంత్

షాద్‌నగర్: జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీలో షాద్‌నగర్‌కు చెందిన ముగ్గురు నేతలకు స్థానం లభించింది. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉదయ్‌గౌడ్, కార్యదర్శులుగా సాబేర్, ప్రశాంత్‌లు ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి యువజన కాంగ్రెస్ కమిటీలో స్థానం కల్పించడంపై రాష్ట్ర, జిల్లా నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి, పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

జీహెచ్‌ఎంసీలో ఆకస్మిక బదిలీలు

- 56 మంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు
- 83 మంది సూపరింటెండెంట్లకు స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆకస్మిక బదిలీలు జరిగాయి. 56 మంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు (ఏఎంసీ), 83 మంది సూపరింటెండెంట్‌లను బదిలీ చేస్తూ కమిషనర్ లోకేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీలో ఒకేసారి ఇంతమంది అధికారులకు స్థానచలనం కలగడం ఇదే తొలిసారి. వార్డు పాలనా వ్యవస్థలో భాగంగా తాజా బదిలీలు చేపట్టినట్లు సమాచారం.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం

- భూ నిర్వాసితుల సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు

షాబాద్: న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని భూ నిర్వాసితుల సంఘం మండల అధ్యక్షుడు ఎన్ ఆంజనేయులు స్పష్టం చేశారు. శుక్రవారం హైతాబాద్ వద్ద రోడ్డుపై చందనవెళ్లి భూనిర్వాసితులు నిరసన తెలిపారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన భాగ్యమ్మ తనకు రావాల్సిన 3 ఎకరాల భూమి డబ్బులు రాలేదని పెట్రోల్ పోసుకోవడానికి యత్నించడంతో వెంటనే పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడతూ భూ పరిహారం కోసం చందనవెళ్లికి చెందిన పలువురు కొన్ని నెలలుగా ధర్నాలు, నిరసనలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఈ ర్యక్రమంలో రైతులు అనంతం, భాగ్యమ్మ తదితరులున్నారు.



హైతాబాద్ వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న చందనవెళ్లి భూ నిర్వాసితులు

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

- రూ.3 లక్షల ఆస్తి నష్టం

యాచారం: ప్రమాదవశాత్తు మంటలంటుకుని పూరి గుడిసె దగ్ధమైంది. మండల పరిధిలోని మాల్ గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో మోతె కృష్ణకు చెందిన పూరి గుడిసెలో శుక్రవారం ఉదయం మంటలంటుకున్నాయి. గమనించి చల్లార్చే ప్రయత్నం చేస్తుండగానే గుడిసె పూర్తిగా కాలి పోయింది. నిత్యం రెక్కాడితే గాని డొక్కాడని మోతె కృష్ణ, సాలమ్మ దంపతులు గుడిసె దగ్ధంతో నిరాశ్రాయులుగా మారారు. గుడిసెలో ఉన్న దాదాపు రూ.3 లక్షల విలువ జేసే దుస్తులు, వంట సామగ్రి, బియ్యం, పప్పులు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు తహసీల్దార్ సుచరితకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన స్వచ్ఛంధ సేవా కార్యకర్త గండ్లపల్లి మురళీ రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు, మోతె కృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన అధికారులను కోరారు.



దగ్ధమైన పూరి గుడిసె

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

వ్యక్తి ఆత్మహత్య

కందుకూరు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్‌జిల్లా వెల్దండకు చెందిన బురుగు నరేశ్ (35) కారు డ్రైవర్‌గా పని చేస్తూ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని తల్లి శంకరమ్మ, తమ్ముడు కందుకూరు చౌరస్తాలో నివసిస్తున్నారు. నరేశ్ గురువారం రాత్రివేళ తల్లి ఇంటికి వచ్చాడు. ఆకలిగా ఉందని చెప్పి దుకాణానికి వెళ్లి నూడుల్స్ తెమ్మని చెప్పి తల్లిని పంపించాడు. అనంతరం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తల్లి వచ్చి చూసి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నరేశ్ మృతదేహం

సంబరాల్లో అపశ్రుతి

- బాణసంచా కాలుస్తుండగా గాయపడిన బాలుడు



చికిత్స పొందుతున్న బాలుడు

మొయినాబాద్: ప్రభుత్వం 111 జీఓ ఎత్తివేసినట్లు ప్రకటించడంతో నిర్వహిస్తున్న సంబరాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. బాణాసంచా కాలుస్తుండగా టపాసు ఎగిరి బస్సులో పడటంతో ఓ బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. 111 జీఓ ఎత్తివేసినట్లు ప్రభుత్వం ప్రకటించడంతో శుక్రవారం మొయినాబాద్‌లో బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య సంబరాల్లో పాల్గొనడంతో పెద్ద ఎత్తున్న బాణాసంచా పేల్చారు. టపాసులు ఎగిరి రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై పడ్డాయి. ఇదే క్రమంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రకాశ్‌చారి కుమారుడు యశ్వంత్(3)పై పడ్డాయి. దీంతో అతని చాతి భాగంలో గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్సకోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.